క్లుప్తంగా

ఆధార్ శిబిరం ప్రారంభం



ఆస్పరిలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ మూలింటి రాధమ్మ

ఆస్పరి: ఆధార్ అప్‌డేట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలనిసర్పంచ్ మూలింటి రాధమ్మ తెలిపారు. సోమవారం ఆస్పరి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేలా ప్రభుత్వం 5 రోజుల పాటు ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తోందన్నారు. సోమ, మంగళవారం తర్వాత 27, 28, 29 తేదీలలో ఆధార్ అప్‌డేట్ చేస్తారని చెప్పారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఈఓ రామాంజినేయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఓ చేతుల మీదుగా అవార్డు



డీఈఓ రంగారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని విజేత

గోనెగండ్ల: ఇటీవల కర్నూలులో జిల్లాస్థాయిలో జరిగిన ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో చిన్నమరివీడు గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని విజేతకు అవార్డు లభించింది.ఈ అవార్డు సోమవారం డీఈఓ రంగారెడ్డి ఆమెకు అందజేశారు. ఈ ప్రోగ్రాంనకు జిల్లాలో 10 పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంపిక కాగా చిన్నమరివీడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విజేతకు అవార్డు లభించింది. దీంతో ఎంఈఓ వినోద్ కుమార్,ఉపాధ్యాయులు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణంలోని ప్రధాన రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభం అయ్యాయి. టెండరు దక్కించుకున్న వైఎంఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ సిబ్బంది గుత్తి రోడ్డులోని పాల శీతలీకరణ కేంద్రం ఎదురుగా కోళ్లఫారం నుంచి రోడ్డు విస్తరణ పనులను సోమవారం సాయంత్రం ప్రారంభించింది. దీంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సోమలగూడూరు వాసికి డాక్టరేట్

నందవరం: మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామానికి చెందిన సుందర రాజుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రీసెర్చ్‌సెల్ కో-ఆర్డినేటర్ కిరణ్మయి తెలిపారు. రాజనీతి శాస్త్రం విభాగంలో 'అన్ ఎవల్యూషన్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కేర్ సిస్టమ్ ఆఫ్ ఇండియా స్పెషల్ రెఫరెన్స్ టు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ఇన్ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన పత్రాలను యూనివర్సిటీ అధికారులు ఆమోదించడంతో ఆయన డాక్టరేట్ పొందనున్నారు.

న్యాయవాద సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

పత్తికొండటౌన్: రాష్ట్ర బార్‌అసోసియేషన్ ఆదేశాల మేరకు పత్తికొండ న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల అధికారి ఎ.మైరాముడు, ఆడిట్ అధికారి పి.ఎల్లారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో షెడ్యూల్ ప్రకటించారు. ఈనెల 23, 24 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 25న పరిశీలన, 26న ఉపసంహరణ ఉంటుందన్నారు. 30వ తేదీ ఉదయం పోలింగ్, సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు విడుదల చేస్తామని వెల్లడించారు.

నవధాన్యాల సాగుతో లాభాలు

వెల్దుర్తి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాలు సాగు చేయడం ద్వారా లాభాలు ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ సూదేపల్లె యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు అన్నారు. ఈ విషయంపై సోమవారం ఆయన మండల పరిధిలోని గుంటుపల్లె గ్రామంలో తోటి సిబ్బంది, విద్యార్థులు, పొదుపు మహిళలతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ, మానవహారాలు చేస్తూ రైతులకు సాగు విధానాన్ని డెమో చూపారు. ఆ శాఖ సిబ్బంది మాబువలి, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

పత్తికొండటౌన్: న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మల్లికార్జున డిమాండ్ చేశారు. విజయవాడ భవానీపురంలో న్యాయవాది వెంకట భగవాన్ కేసు పెట్టడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళితే అతడిపైనే అన్యాయంగా పోలీసులు కేసులు బనాయించడంతో రాష్ట్ర బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం పత్తికొండలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదిపై అక్రమంగా కేసు నమోదు చేసిన పోలీసు అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యానికి భరోసా

- పల్లెల్లోని ఆరోగ్య కేంద్రాలలో 60 రకాల వైద్య పరీక్షలు
- నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. ఇప్పటివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గతంలో కేవలం కొన్ని రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండగా ప్రస్తుతం 60 రకాల వైద్య పరీక్షలు చేయించుకోడానికి అధునాతన వైద్య పరికరాలు అందిస్తోంది. ఆరోగ్య పరీక్షలను పీహెచ్‌సీ స్థాయిలో తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మద్దికెర-1, తుగ్గలి -1, పగిడిరాయి -1, పత్తికొండలో పత్తికొండ, పుచ్చకాయలమాడ, కృష్ణగిరి-1, వెల్దుర్తి -1 చొప్పున 7 ప్రాథమిక వైద్య కేంద్రాలున్నాయి. వీటిలో గతంలో కొన్ని రకాలు వైద్య పరీక్షలు మాత్రమే చేసేవారు. అయితే ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బయోకెమిస్ట్రీ, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్ వంటి అధునాతన పరికరాలను అందించడంతో మరిన్ని పరీక్షలు చేసేందుకు అవకాశం కలిగింది. ఈ పరికరాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు దాదాపు 60 రకాల ఆరోగ్య, రక్త పరీక్షలు ఉచితంగానే ప్రభుత్వ ఆసుపత్రులలో చేయడంతో పాటు వాటి ఆధారంగా చికిత్స అందిస్తారు. ప్రభుత్వ వైద్యశాలలో మందులు ఉండవనే చులకన భావాన్ని చెరిపి వేసేలా ప్రజలకు అవసరమైన మందులన్నీ అందించేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. హెచ్ఐవీ, హైపటైటిస్, డెంగీ, బ్లడ్ క్లాటింగ్ థైరాయిడ్, సీరమ్, సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, యూఆర్‌ఈఏ, హెచ్‌బీ, ప్లేట్‌లెట్ కౌంట్ లాంటి ఖరీదైన వైద్యపరీక్షలు ప్రజలకు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఆయా పరీక్షలు చేసేందుకు ఇప్పటికే ల్యాబ్ అసిస్టెంట్‌లకు నెల రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం విషయంలో ఇబ్బందులు పడకుండా అన్నిరకాలు వైద్యపరీక్షలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమయ్యే మందులన్నింటినీ ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అలాగే వైద్య పరీక్షలు చేయడానికి అధునాతన పరికరాలు కూడా అందించింది.ప్రజలు అనవసరంగా ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోకుండా ప్రభుత్వ వైద్యశాలలో అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– నగేష్, ప్రభుత్వ వైద్యాధికారి, మద్దికెర

వైద్య పరీక్షలు చేయడంపై శిక్షణ ఇచ్చారు



వైద్యశాలలో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు మాకు 22 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. వైద్యశాలకు వచ్చిన వారికి అవసరమైన రక్త, వైద్య పరీక్షలను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే అవసరమైన మందులు ఉచితంగా అందిస్తాం.

– విజయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్, మద్దికెర

గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ



గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ వైద్యశాలల్లోనే అన్ని రకాలు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. వారికి అవసరమైన మందులన్నీ ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ప్రజలు ప్రభుత్వ వైద్యశాలల్లో లభించే సేవలు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పలు కార్యక్రమాలు చేపడుతోంది.

– దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ, మద్దికెర

22న జనార్దన స్వామి రథోత్సవం

ఆస్పరి: ఉగాది పండుగ సందర్భంగా ఆస్పరిలో వెలసిన జనార్దన స్వామి రథోత్సవం ఈనెల 22న నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గురువారం నుగ్గులాట, శుక్రవారం వసంతోత్సవం, ఉట్లోత్సవంతో స్వామి వారి ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

కల్యాణ మండపం ప్రారంభోత్సవం

ఆస్పరి: ఆస్పరిలో జనార్దన స్వామి ఆలయం ఆవరణలో దాతలు దాసప్పగారి పెద్ద రంగన్న, నీలావతి దంపతులు రూ.12 లక్షలతో కొత్తగా కల్యాణ మండపం నిర్మించారు. సోమవారం కల్యాణ మంటపం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, గోమాత ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జెడ్పీటీసీ దొరబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

886 మందికి విద్యాదీవెన

మద్దికెర: మండలంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాదీవెన పథకం కింద 886 మంది విద్యార్థులకు మంజూరైన రూ.31 లక్షలు నగదును వారి తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. ఖాతాల్లో జమ అయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును పది రోజుల్లో సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని కోరారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



ఎమ్మిగనూరులో బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో రోడ్ల నిర్మాణాలు నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని లక్ష్మణ్ థియేటర్ నుంచి ఎస్ఎస్ ట్యాంక్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. లక్ష్మణ్ థియేటర్ నుంచి ట్యాంక్ సమీపం వరకు రూ.40 లక్షలతో దాదాపు 370 మీటర్ల మేరకు నిర్మిస్తున్న రోడ్డు ఆ ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలతో పాటు మంచినీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేసి ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇచ్చే ప్రక్రియను అధికారులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తదితరులు వెంట ఉన్నారు.

పనుల అడ్డగింత



రైతులు, మసీదు కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

పత్తికొండ రూరల్: స్థానిక షాదిఖానా వెనుక కడగమ్మ వంక చదును పనులను సోమవారం రైతులు అడ్డుకున్నారు. చెరువుకట్ట పరిసరాలు ఆక్రమణకు గురవుతున్నాయని మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీఈ చంద్రశేఖర్, తహసీల్దారు విష్ణుప్రసాద్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రదేశాన్ని పరిశీలించారు. మసీదు, అంగన్‌వాడీ కేంద్రం వెనుకల పూర్తిగా మురుగునీరు చేరి అపరిశుభ్రత ఉన్నందున శుభ్రం చేసుకుంటామని తమకు చెప్పినట్లు అధికారులు తెలిపారు. అక్కడ ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తాము ఎలాంటి ఆక్రమణలు చేయలేదని మురుగును పూడ్చివేసి, ముళ్లకంచెలు తొలగించినట్లు మసీదు కమిటీ అధ్యక్షుడు నూర్‌బాషా తెలిపారు.

22న బండలాగుడు పోటీలు

చిప్పగిరి: ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 22న డేగులహాలు గ్రామంలో మండలస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ నీలకంఠ సోమవారం తెలిపారు. పోటీల్లో విజేతగా నిలిచిన వృషభాల యజమానులకు రూ.20,000 నగదు, 20 తులాల వెండి, రెండో బహుమతి రూ.15,000 నగదు, 15 తులాల వెండి, మూడో బహుమతి రూ.10,000 నగదు, 10 తులాల వెండిని దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు.

25న ఎరుకలచెర్వులో..

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామంలో తిమ్మగురుడు స్వామి తిరునాల సందర్భంగా ఈ నెల 25న పాలపళ్ల ఎద్దులకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వాటికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ. 20 వేలు,రూ.10 వేలు, రూ. 5వేలను దాతల సహకారంతో అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వృషభాల యజమానులు 24వ తేదీ సాయంత్రంలోగా రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 96766 52175, 97039 96458 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్బీకేల సేవలు విస్తృతం చేయండి

వెల్దుర్తి: రైతు భరోసా కేంద్రాలలో అందుతున్న సేవలు, ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న ప్రతి పథకం వివరాలు రైతులకు తెలియజేసి వారు వినియోగించుకునేలా చూడాలని ఏఓ అక్బర్‌బాషా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని గోవర్ధనగిరి-1, 2, శ్రీరంగాపురం, బింగిదొడ్డి ఆర్బీకేలను తనిఖీ చేశారు. రికార్డులు, అందిస్తున్న సేవల పట్ల విచారించారు. శనగ దిగుబడులను ప్రభుత్వ మద్దతు ధర క్వింటం రూ.5,335 ప్రకారం విక్రయించేందుకు ఆసక్తిగల రైతుల నుంచి వివరాలు సేకరించి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని ఆదేశించారు.

25న పంచాయతీ వేలం పాట

హొళగుంద: హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన వేలం పాటలు ఈ నెల 25న సర్పంచ్ మాల రంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీకి సంబంధించిన వారపు సంత మార్కెట్, బస్టాండు, కమేళా, సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్ ఏడాది నిర్వహణకుగాను వేలం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే స్థానిక బస్టాండులోని 5 హోటల్ స్థలాలకు మూడేళ్ల లీజుకు సంబంధించి వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వాటర్‌ప్లాంట్‌కు రూ.5 వేలు, మిగతా వాటికి సాల్వెన్సు (సొంత ఆస్తులు ఉన్న వారు) రూ.50 వేలు, రూ.లక్ష ప్రకారం డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. సాల్వెన్సు లేని వారు రూ.70 వేలు, రూ.2 లక్షలు ప్రకారం డిపాజిట్ చేయాలని చెప్పారు. వేలంలో హక్కులు దక్కించుకున్న వారు నిబంధనలు పాటించాలని, పాడిన మొత్తంతో పాటు మూడు శాతం స్టాంపు డ్యూటీ అదనంగా వెంటనే చెల్లించాలని చెప్పారు. గతంలో వేలం పాటల్లో పాల్గొని నేటికి పంచాయతీకి బకాయి ఉన్న వారిని అనుమతించబోమని స్పష్టం చేశారు.

అనుమతి లేకుండా ప్లాట్లు వేస్తే చర్యలు

మద్దికెర: మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. మద్దికెర పరిసరాలలో కొందరు వాగుకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకోవడమే గాకుండా వేలాది రూపాయలు వెచ్చించి వేసిన గట్టు మట్టిని తరలించారని ఫిర్యాదు రావడంతో ఆయన సోమవారం పరిశీలించారు. సంబంధిత స్థల యజమానులను పిలిపించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గట్టు మట్టిని తరలించడం వల్ల భారీ వర్షాలు వస్తే పొలాల్లోకి నీరు చేరి రైతులు నష్టపోయే అవకాశం ఉందని వివరించారు. తీసిన మట్టిని మళ్లీ వేసి గట్టును పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్ఓ రంగస్వామి వెంట ఉన్నారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ పరిధిలో గుత్తకు తీసుకున్న పొలంలో బేతంచెర్ల మండలం పెండేకల్లుకు చెందిన కుమ్మరి వెంకటరమణ (40) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై ఏఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ, లక్ష్మీదేవి దంపతులు కూలీతోపాటు పొలం గుత్తకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లల స్కూలు ఫీజు కట్టే విషయంలో దంపతుల మధ్య ఆదివారం గొడవ జరిగింది. తర్వాత పొలానికి వెళ్లిన వెంకటరమణ చెట్టుకు పంచెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు, సాయంత్రం పొలంవైపు వెళ్లిన గొర్రెల కాపరులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

చిప్పగిరి: మద్యం దుకాణంలోకి దొంగలు ప్రవేశించి రూ.2.20 లక్షలు దోచుకెళ్లిన సంఘటన చిప్పగిరిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. ఆదివారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది పని వేళలు ముగిశాక దుకాణానికి తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం దుకాణం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.2.20 లక్షలు నగదుతో పాటు పగులగొట్టిన తాళాలు సైతం ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన సిబ్బంది తాళాలు లేకపోవడం చూసి పరిశీలించగా చోరీ జరిగినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేస్వర్లు సోమవారం పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కృష్ణగిరి:మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలోని నీళ్ల ట్యాంక్ వద్ద కర్ణాటక మద్యం కలిగిఉన్న గ్రామానికి శిలబోయిని అంజనేయులును సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇతని వద్ద నుంచి 25 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ 90ఎంఎల్ పరిమాణం గల టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

క్షయ నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ మారుతికుమార్

ఆలూరు రూరల్: క్షయ వ్యాధి నిర్మూలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యుడు మారుతి సూచించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మొలగవల్లి, హాలహర్వి, అర్ధగేరి పీహెచ్‌సీల పరిధిలో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీలతో (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు) ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, గళ్ల, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలున్న వారికి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిల్లో గళ్ల పరీక్ష, ఎక్స్‌రే సీబీనాట్, ఆర్టీపీసీఆర్‌లతో పరీక్ష చేయించాలన్నారు. ఈ వ్యాధి రోగి దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు ఇంకొకరికి సంక్రమిస్తుందన్నారు. వ్యాధి నివారణకు ఆరు నెలలకు సరిపడే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. మొండి టీబీ వ్యాధికి 9 నుంచి 20 నెలల పాటు రూ.2.20 లక్షల మందులను ఉచితంగా అందిస్తారన్నారు. చికిత్స సమయంలో రోగికి రూ.500 నగదు పోషకాహారం కోసం, రోగి పర్యవేక్షకుడికి రూ.1,000 నుంచి రూ.5 వేల వరకు పారితోషికం ఇస్తుందన్నారు. ఈ విషయాలన్నీ క్షయ వ్యాధిగ్రస్తులకు తెలియజేసి వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెప్పాలన్నారు. ఆలూరు టీబీ నిర్మూలన అధికారి గోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు హాజరయ్యారు.

వేలంలో రూ.59.97 లక్షల ఆదాయం



కమిషనర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పురపాలక సంఘ పరిధిలోని పలు మార్కెట్ల వేలం పాటలు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగాయి. ఆయా వ్యాపార హక్కుల వేలం ద్వారా రూ.59.97లక్షలు ఆదాయం లభించింది. వారపు సంత మార్కెట్ వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మంగళవారానికి వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ప్రకటించారు. దినసరి మార్కెట్ వేలం పాటను రూ.27,54,000లకు దస్తగిరి అనే వ్యక్తి దక్కించుకున్నాడు. అదేవిధంగా వారపు పశువుల మార్కెట్‌ను బి.రామకృష్ణ రూ.15,59,000లకు, గొర్రెల మార్కెట్‌ను విపి.రంగన్న రూ.15,52,000లకు, మటన్ మార్కెట్‌ను కె.మాబాషా రూ.1,32,000లకు, గొర్రెల కమేళా రఫీక్ రూ.1,27,000లకు దక్కించుకున్నారు. ఆయా మార్కెట్లను రూ.59,97,000లకు వేలంలో పాటదారులు దక్కించుకోగా వాటికి సంబంధించి రూ.రూ.31,69,000లను డిపాజిట్లుగా చెల్లించినట్లు కమిషనర్ వెల్లడించారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన

మద్దికెర: ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ అన్నారు. సోమవారం మద్దికెర హరిజన కాలనీలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నోటి ఆరోగ్యం కోసం ఐదు నియమాలు పాటించాలన్నారు. కాన్సర్‌కు కారణమయ్యే గుట్కా, కైనీ, పొగాకు, మద్యపానం, అధిక ఘాటు కారం తీసుకోరాదన్నారు. ఆహారం తిన్న తర్వాత నీటితో పుక్కిలించాలన్నారు.

ఆలూరు రూరల్: ముందు జాగ్రత్తలు పాటిస్తే నోటి సంబంధిత వ్యాధులను నివారించవచ్చని ఆలూరు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, డెంటిస్ట్ పద్మజ అన్నారు. జాతీయ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఆలూరు సీహెచ్‌సీ నుంచి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా తప్పనిసరిగా బ్రష్ చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎమ్మిగనూరురూరల్: ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి సోమవారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని సోమప్ప నగర్‌లో దొరస్వామి, బుజ్జమ్మ దంపతులు నివాసముంటున్నారు. తన పుట్టినిల్లు చిట్యాలకు పంపలేదని ఆదివారం బుజ్జమ్మ భర్తతో గొడవపడింది. మనస్తాపంతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం

నందవరం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలచింత గ్రామానికి చెందిన రవీంద్రరెడ్డి అనే రైతు తన పొలం సర్వే చేసి హద్దులు చూపాలని తహసీల్దార్‌కు అర్జీ అందజేశారు. అలాగే నందవరం గ్రామానికి చెందిన సమ్రాన్‌బాబు అనే రైతు తమ పొలం సర్వే నంబర్లు 564, 566, 73సీలోని భూమిని సర్వే చేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు. అనంతరం తహసీల్దార్ ఇద్దరు రైతులను పిలిపించి ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, పీఆర్ ఏఈ జయన్న, ఏఈఓ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

తుగ్గలి: అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు శ్రీరాములు, కాంతమ్మ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అలాగే గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ తర్వాత వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీల్లో సౌకర్యాలు ఏర్పాటు చేసి, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



చిట్యాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కృష్ణగిరి: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని డోన్ ఆపరేషన్ డీఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో నూతనంగా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సోమవారం ఆయన ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ రాజేష్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. త్వరలో భూమి పూజ చేసి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో గ్రామంతోపాటు కోయిలకొండ, పెద్దొడ్డి తదితర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి, సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వో ఆయ్యన్న, లైన్‌మెన్ ధనుంజయగౌడ్ తదితరులు ఉన్నారు.